క్లుప్తంగా

ఆలయ హుండీ లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

మీర్‌పేట: జిల్లెలగూడలోని మత్స్యావతార వేంకటేశ్వరస్వామి దేవాలయ హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని బుధవారం ఆలయ ఆవరణలో నిర్వహించారు. గత మూడునెలలకు గాను హుండీ ఆదాయం రూ.1,84,555లు వచ్చిందని ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి, మాజీ ధర్మకర్తలు యాదగిరిముదిరాజ్, జ్ఞానేశ్వ రాచారి, సిబ్బంది నర్సయ్య, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు



పూజల్లో పాల్గొన్న చిన్నారెడ్డి, నర్సింహారెడ్డి

కందుకూరు: మండల పరిధిలోని లేమూరులోని స్వయంభూ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ సర్పంచ్ గూడూరు కొండారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేకంగా వ్రతం, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీనిచ్చారు.

ఉచిత వైద్య శిబిరం



రోగులకు మందులు అందజేస్తున్న నాయకులు

మీర్‌పేట: ప్రైవేట్ ఆస్పత్రులు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి సూచించారు. మీర్‌పేట కార్పొరేషన్ ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీలో వెల్‌నెస్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని శంకర్‌రెడ్డి ప్రారంభించారు. పేద ప్రజలు ఎక్కువగా నివాసముండే లెనిన్‌నగర్ వంటి బస్తీలలో కూడా వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా శంకర్‌రెడ్డి కోరారు. అనంతరం వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి ఆయన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఎడ్ల మల్లేశ్ ముదిరాజ్, నాయకులు మాదరి శ్రీనివాస్, చెవ్వ శ్రవణ్, విజయ్‌కుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరం

నందిగామ: నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహాయాదవ్ అన్నారు. మండల కేంద్రమైన నందిగామలో అదే గ్రామానికి చెందిన మంగలి శ్రీనివాస్‌కు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.15వేల చెక్కును నర్సింహాయాదవ్ బుధవారం బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, దేవల్లి కుమార్‌గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ నర్సింలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల నిరసన

కేశంపేట: గ్రామ పంచాయతీ కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులను కలిసినా సమస్యలు పరిష్కారం కావడం లేదని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్య అన్నారు. ఇందిరా పార్కులో ధర్నా కోసం పర్మిషన్ తీసుకున్న తర్వాత పోలీసులు కార్మికులను ఎక్కడికక్కడ అరెస్టులు చేశారని ఆయన ఆరోపిస్తూ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కార్మికుల పట్ల నియంతృత్వ ధోరణి వదిలి తమకు న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పారేష, రవి, పద్మమ్మ, జంగయ్య, రవి, భిక్షమయ్య, రాములు పాల్గొన్నారు.



మామిడి.. తెగుళ్లపై కట్టడి

కందుకూరు: ప్రస్తుత చలి తీవ్రతతో మామిడి పంటలో వచ్చే తెగుళ్లపై అశ్రద్ధ చేయొద్దు. మామిడి పూత దశలో తేనె మంచు పురుగు, బూజు తెగులు, తామర పురుగు ఆశిస్తుంది. వాటి నివారణకు మొగ్గ దశలో ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5గ్రా, శిలీంద్ర నాశని అయిన హెక్సాకొనజోల్ 1 మి.లీ లేదా థయోఫినేట్ మిథైల్ 1గ్రా లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పచ్చిపూత దశలో థయోమిథాక్సామ్ 0.3గ్రా లేదా డైమిథోయేట్ లేదా లామ్డా సైహలోత్రిన్ 2 మి.లీ నీటిలో కరిగే గంధకం 3గ్రా లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. అకాల వర్షాలతో వచ్చే తెగుళ్ల నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రా లేదా కాపర్‌హైడ్రాక్సైడ్ 3గ్రా లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

– జి.శ్రీకృష్ణ, కృషి విజ్ఞాన్ కేంద్రం క్రిడా నిపుణుడు



చకచకా.. రిజిస్ట్రార్ భవన పనులు



బడంగ్‌పేటలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణ పనులు

- త్వరలోనే అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు
- కొనసాగుతున్న కార్యాలయ నిర్మాణ పనులు
- తీరనున్న క్రయవిక్రయదారుల కష్టాలు

బడంగ్‌పేట్: బడంగ్‌పేట్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. కార్పొరేషన్ పరిధిలోని దావుత్‌ఖాన్ గూడలోని సర్వేనెంబర్ 2లో, కొత్త మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆనుకొని బడంగ్‌పేట నుంచి నాదర్‌గుల్ వయా ఆదిబట్ల వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకొని ఈ నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఎల్‌బీనగర్ సాగర్ రింగ్‌రోడ్డులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం గత కొన్నేళ్లుగా అద్దె భవనంలోనే కొనసాగుతోంది. మున్సిపల్ కార్పొరేషన్‌కు కేటాయించిన స్థలం నుంచే బాలాపూర్ రెవెన్యూ అధికారులు అర ఎకరాకు తక్కువగా ఉండే ప్రభుత్వ స్థలాన్ని కేటాయించడంతో పాటు కార్పొరేషన్ అధికారుల, పాలకవర్గం ఏకగ్రీవ నిర్ణయంతో ఈ మెయిన్ రోడ్డు స్థలాన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి అందజేశారు. దీంతో ఉన్నతాధికారుల నుంచి సొంత భవనం నిర్మించుకునేందుకు అనుమతులు రావడంతో పనులు మొదలుపెట్టారు. ఇక్కడ పార్కింగ్‌కు ఎలాంటి సమస్య ఉండదు. పార్కింగ్ స్థలం చాలా ఉంది. ఈ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అందుబాటులోకి వస్తే బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్, కుర్మల్‌గూడ, మల్లాపూర్, వెంకటాపూర్, సుల్తాన్‌పూర్, బాలాపూర్, అల్మాస్‌గూడ, బడంగ్‌పేట్, గుర్రంగూడ, మీర్‌పేట్ కార్పొరేషన్, జిల్లెలగూడ తదితర శివారు ప్రాంతాల నుంచి అత్యధిక ఆదాయం (నెలకు కోట్లల్లో) వస్తుంది. ఈ ప్రాంతాలే కాకుండా ఎల్‌బీనగర్, చైతన్యపురి, ఆర్‌కేపురం, సరూర్‌నగర్, కర్మాన్‌ఘాట్, హస్తినాపురం, తదితర గ్రేటర్ ప్రాంతాల్లోని డివిజన్‌లకు సంబంధించిన రిజిస్ట్రేషన్ లావాదేవీలు ప్రస్తుతం కొనసాగుతున్న సాగర్ రింగ్‌రోడ్డులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచే కొనసాగుతున్నాయి. వేసవి కాలంలోపు పనులు పూర్తి చేసుకుని ప్రజలకు అందుబాటులోకి రానుంది. బడంగ్‌పేట్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సేవలు అమల్లోకి వస్తే ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీరినట్లేనని ఇక్కడి ప్రజలు, క్రయవిక్రయదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అన్ని రకాల సేవలు అందుబాటులోకి తెస్తాం



బడంగ్‌పేట్ కార్పొరేషన్‌కు కోట్లు నిధులు వెచ్చించి పక్కా భవనం నిర్మించుకున్నాం. కార్పొరేషన్‌కు ఎదురుగానే ప్రజాభవన్‌ను నిర్మించి ఉచితంగా వివాహాలు జరిపించేలా చేశాం. రెవెన్యూ మండలాన్ని బడంగ్‌పేటకు తీసుకొచ్చాం. స్టేడియం అందుబాటులోకి తెచ్చాం. రాక్ పార్కును, బట్టేల్ గుట్ట పార్కును అందుబాటులోకి తీసుకొచ్చాం. క్రయ విక్రయదారులు పడుతున్న ఇబ్బందులు గమనించి ఇక్కడే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నాం. బడంగ్‌పేట కార్పొరేషన్‌ను ఐకాన్ చేయాలన్నదే మా లక్ష్యం.

– చిగురింత పారిజాత, మేయర్



ఎంపీఓ గీతకు వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్మికులు, నాయకులు

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

కందుకూరు: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ విమర్శించారు. ఇందిరాపార్కులో నిర్వహించిన కార్యక్రమానికి మంగళవారం వెళ్లకుండా గ్రామ పంచాయతీ కార్మికులను అక్రమంగా ముందస్తు అరెస్టులు చేయడాన్ని నిరసిస్తూ బుధవారం ఎంపీడీఓ కార్యాలయం, పీఎస్ ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు ఆందోళన చేశారు. అనంతరం ఎంపీఓ గీతకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్ మాట్లాడుతూ.. పోలీస్ కమిషనర్ నుంచి ఇందిరాపార్కు ధర్నాకు అనుమతులు ఉన్నా స్థానికంగా ఉన్న పోలీసులు అత్యుత్సాహంతో ముందస్తు అరెస్టులు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గత బీఆర్‌ఎస్ పాలనలో పంచాయతీ కార్మికులు ఆందోళనలు చేస్తున్నప్పుడు మద్దతు తెలిపిన కాంగ్రెస్ నాయకులు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఏడాది గడిచినా ఇంతవరకు ఎలాంటి సమస్య పరిష్కారం కాలేదన్నారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించి నెలకు రూ.18 వేల వేతనాన్ని అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కారోబార్లు బాల్‌రాజ్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, హరికృష్ణ, శ్రీధర్, పంచాయతీ కార్మికులు జయమ్మ, మల్లమ్మ, చిన్నమ్మ, నర్సింహ, రాములు, జంగయ్య, సురేశ్, నల్ల శారదమ్మ, హంసమ్మ, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

మేలైన పద్ధతులతో అధిక దిగుబడి



రైతు సదస్సులో పాల్గొన్న శాస్త్రవేత్తలు, విద్యార్థులు, రైతులు

చేవెళ్ల: వ్యవసాయంలో రైతులు మేలైన సాగు పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధిస్తారని పలుగుట్ట మాజీ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, రాజేంద్రనగర్ పూల పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ జ్యోతి, డాక్టర్ ప్రణీత్‌లు అన్నారు. చేవెళ్ల మండలంలోని పలుగుట్ట గ్రామంలో మొజెర్ల కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన కళాశాల విద్యార్థుల క్షేత్ర పర్యటనలో భాగంగా బుధవారం గ్రామంలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు శాస్త్రవేత్తలతో పాటు కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ పూర్ణిమ మిశ్రాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎక్కువగా పూలసాగు చేసే రైతులు ఉండటంతో వారికి కావాల్సిన సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. దీంతో పాటు ప్రజలకు, రైతులకు పెరటి తోటల పెంపకం, మిద్దె పంటల సాగు, పుట్టగొడుగుల సాగు, తదితర వాటి గురించి తెలియజేశారు. కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ పూర్ణిమ మిశ్రా మాట్లాడుతూ..రైతులు వ్యవసాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. ఉద్యాన సాగులో మెలకువలు, పద్ధతుల గురించి అవగాహన కల్పించేందుకు వచ్చిన శాస్త్రవేత్తలకు, గ్రామంలో పర్యటిస్తున్న ఉద్యాన కళాశాల విద్యార్థులకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన విద్యార్థులు పవన్ వెంకటేశ్, శ్రీకాంత్, శ్రీవన్‌రెడ్డి, శివసాయి, రాజు, గ్రామస్తులు, రైతులు తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

- విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కోశాధికారి రమేశ్



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న బండారి రమేశ్, భక్తులు

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కోశాధికారి బండారి రమేశ్ అన్నారు. సంకటహర చతుర్థిని పురస్కరించుకొని బుధవారం సాయిమిత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో పట్టణంలోని వినాయక గంజ్‌లో ఉన్న గణపతి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో బండారి రమేశ్, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ పాల్గొని స్వామివారిని దర్శించుకొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. హిందూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ యాదయ్యయాదవ్, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు ఒగ్గు కిషోర్, ఆలయ ట్రస్టు సభ్యులు ఓం ప్రకాశ్, మహావీర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇళ్ల సర్వే



రావిర్యాలలో సర్వే చేస్తున్న మున్సిపల్ అధికారులు

తుక్కుగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే మున్సిపాలిటీ వ్యాప్తంగా కొనసాగుతోంది. బుధవారం మూడోరోజు వార్డుల వారీగా కేటాయించిన అధికారులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సేకరించారు. కార్యక్రమంలో వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'మొయినాబాద్'కు చిలుకూరు బాలాజీ పేరుపెట్టాలి

బీజేపీ జిల్లా నాయకుడు గోపాల్‌రెడ్డి

మొయినాబాద్: మొయినాబాద్ మండలంలోని ఏడు గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయొద్దని బీజేపీ జిల్లా నాయకుడు గున్నాల గోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మొయినాబాద్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీగా మారిస్తే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. ప్రభుత్వం ఎవరి ప్రయోజనాల కోసం మున్సిపాలిటీ ఏర్పాటు చేస్తోందని ప్రశ్నించారు. ఒకవేళ మున్సిపాలిటీ ఏర్పాటుచేస్తే దానికి చిలుకూరు బాలాజీ పేరుపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రతిపాదించిన ఏడు గ్రామ పంచాయతీల్లో చిలుకూరు గ్రామ పంచాయతీ పెద్దది అని జనాభా, ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉంటుందన్నారు. కలియుగ దైవం చిలుకూరు బాలాజీ పేరుతో మున్సిపాలిటీ ఏర్పాటు చేయాలన్నారు. మొయినాబాద్ మండలానికి సంబంధించిన అన్ని ప్రభుత్వ కార్యాలయాలు చిలుకూరు రెవెన్యూలో ఉన్నా చిలుకూరు పేరు పెట్టకుండా గతంలో కూడా ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. ప్రస్తుతం అలా జరగకుండా చిలుకూరు బాలాజీ పేరుతో మున్సిపాలిటీని ఏర్పాటు చేయాలన్నారు. లేదంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు.

'బీజేపీ అంబేడ్కర్‌ను గౌరవించింది'

షాద్‌నగర్‌రూరల్: రాజ్యాంగ నిర్మాత బీఆర్.అంబేడ్కర్‌ను ఆనాటి జన సంఘ్ ప్రస్తుత బీజేపీ గౌరవిస్తూ పార్లమెంట్‌కు పంపిందని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంకనోళ్ల వెంకటేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా గురించి మాట్లాడే నైతిక హక్కు బీఎస్పీ నాయకులకు లేదన్నారు. దేశంలో అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నది బీజేపీ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. బీజేపీ హయాంలోనే పార్లమెంట్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని పెట్టామని గుర్తుచేశారు. అంబేడ్కర్ పేరు చెప్పుకొని ఓటు బ్యాంకు కోసం పనిచేసే బీఎస్పీకి అమిత్‌షాను విర్శించే నైతిక హక్కు లేదన్నారు. పార్టీపై బురద జల్లాలనే ప్రయత్నం మానుకోవాలని, లేని యెడల చరిత్ర హీనులుగా మిగిలిపోతారని పేర్కొన్నారు.



క్రీడాకారులతో చైర్‌పర్సన్, నాయకులు

జిల్లాస్థాయి పోటీలు ప్రారంభం

తుక్కుగూడ: జిల్లాస్థాయి పోటీలను తుక్కుగూడలో నిర్వహించడం అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ బరిగెల హేమలత అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ జిల్లాస్థాయి పోటీలను ఆమె ప్రారంభించి, విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడాకారులను పాఠశాల స్థాయి నుంచి ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఈ పోటీలను నిర్వహిస్తోందన్నారు. క్రీడాకారులకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. ఇందులో భాగంగా రూ.10లక్షల విలువైన ఖోఖో మ్యాట్‌ను ఈ పోటీలకు అందజేశామన్నారు. జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించిన వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు తమ ప్రతిభను కనబరించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బి.వెంకట్‌రెడ్డి, ఎంఈఓలు కస్నా నాయక్, పాండు, హెచ్‌ఎం రాములు, కౌన్సిలర్లు భావన, ఆర్.రాజు, చెన్నకృష్ణారెడ్డి, విజయ్‌సాగర్, సుధాకర్‌రెడ్డి, సాబేర్, ముత్యాల మహేందర్, భాస్కర్‌రెడ్డి, రవికుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చలో రాజ్‌భవన్‌కు తరలిన నాయకులు



డిప్యూటీ సీఎంను కలిసి సంఘీభావం తెలియజేస్తున్న పీసీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి

మహేశ్వరం: అదానీపై వచ్చిన ఆర్థిక అవకతవకల ఆరోపణల అంశంలో కేంద్రం వైఖరికి నిరసనగా కాంగ్రెస్ నేతలు చలో రాజ్‌భవన్ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను బుధవారం పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి కలిసి సంఘీభావం తెలిపారు. భారత వ్యాపార వ్యవస్థలు అవినీతిలో కూరుకుపోయాయని, వ్యాపారాలు చేయాలంటే లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఉందని దేప భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ దేశాల ముందు భారత్ పరువును మోడీ, అదానీ తాకట్టు పెట్టారని ఆరోపించారు. అంతకుముందు మహేశ్వరం నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో చలో రాజ్‌భవన్‌కు తరలివెళ్లి అక్కడ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డిలను కలిసి సంఘీభావం తెలిపారు. మహేశ్వరం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లూరు రాజు కూడా భట్టి విక్రమార్కను కలిసి సంఘీభావం తెలిపారు.

హక్కులను కాలరాస్తున్న కేంద్రం



ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రవీంద్రాచారి, తదితరులు

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి

మీర్‌పేట: కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికలు తీసుకొచ్చి రాష్ట్రాల హక్కులను హరించే విధంగా చేయాలని చూస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి ఆరోపించారు. సీపీఐ వంద సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26న జరిగే ఉత్సవాల పోస్టర్లను బుధవారం మీర్‌పేట లెనిన్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీంద్రాచారి మాట్లాడుతూ.. దేశ స్వాతంత్య్ర, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాల్లో సీపీఐ పార్టీ కీలకపాత్ర పోషించిందన్నారు. ఎన్నో భూ పోరాటాలు చేసి పేదలకు భూములు పంచిందని గుర్తుచేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకపోగా, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పాలన సాగిస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ బాలాపూర్ మండల కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జర్పుల శివ నాయక్, రాజు, రమావత్ ఛత్రునాయక్, జటావత్ రెడ్యానాయక్, కేతావత్ శ్రీను, దత్తునాయక్, వీరాస్వామి, మొగులయ్య, శ్రీనివాస్, నందు, విజయలక్ష్మమ్మ, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలి

- టీయూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ మునీర్‌పాషా



ఆలూరు పాఠశాల వద్ద సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు, ఉపాధ్యాయులు

చేవెళ్ల: డీఎస్సీ 2024 ద్వారా విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులకు వెంటనే వేతనాలు చెల్లించాలని టీయూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ మునీర్‌పాషా డిమాండ్ చేశారు. మండలంలోని ఆలూరు, తంగడపల్లి, ఖానాపూర్, ఈర్లపల్లి, దేవరంపల్లి, కౌకుంట్ల, రేగడిఘనాపూర్ పాఠశాలల్లో బుధవారం టీయూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీ నిర్వహించి నూతన ఉపాధ్యాయుల నియామకం చేపట్టిందన్నారు. ఉపాధ్యాయులు విధుల్లో చేరి మూడునెలలు కావొస్తున్నా వారికి ఇప్పటివరకు జీతాలు అందలేదన్నారు. మూడు నెలలుగా వారు నానాఇబ్బందులు పడుతూ ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి వారి జీతాలు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో చేవెళ్ల మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దయానంద్, శివానందం, శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు అంజయ్య, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఐ వారోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వంద వసంతాల ప్రచార వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

చేవెళ్ల: పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేసే సీపీఐ పార్టీ వంద వసంతాల వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం పార్టీ వంద వసంతాల వేడుకలకు సంబంధించిన ప్రచార వాల్‌పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1925లో ఏర్పడిన పార్టీ 99 సంవత్సరాలు పూర్తి చేసుకొని వంద సంవత్సరంలోకి అడుగు పెట్టిందన్నారు. ఈ వేడుకలను ప్రజలందరికీ తెలిసేలా వేడుకగా జరుపుకోవాలని పార్టీ ఆదేశించిందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామగ్రామాన వేడుకలు ఘనంగా జరుపుకోవాలన్నారు. ప్రజలకు తెలిసేలా వాల్‌పోస్టర్లతో ప్రచారం నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి సత్తిరెడ్డి, నాయకులు మంజుల, కృష్ణాగౌడ్, శివ, యాదగిరి, శ్రీకాంత్, మురళీ తదితరులు ఉన్నారు.